ఆంధ్ర వాహిని (అట్టావా) నిర్వహించిన 1988 శ్రీరామనవమి కథల పోటీలలో
సాధారణ ప్రచురణకి ఎన్నికైన కథ

# ఊబి

## పాలపర్తి ధనరాజ్

''బాబోయ్ వచ్చేస్తోంది, తప్పుకోండి, తప్పుకోండి'' అంటూ రోడ్డు మీద పరుగెత్తాడు. ఆ రోడ్డున వెళ్ళే పాతవాళ్ళు పట్టించుకోలేదు. కొత్త వాళ్లు అదిరిపడి చూశారు.

''తప్పుకోండి, విమానం వచ్చేస్తోంది. అదిగో వెళ్ళిపోతోంది. నేను వెళ్ళను. వచ్చినా వెళ్ళను. వెళ్ళనంతే. మీరూ వెళ్ళకండి. ఆ... అంతే'' మళ్ళీ పరిగెత్తుతూ అరిచాడు.

ఆ పరిగెత్తేది ఓ పిచ్చివాడు.

బవిరిగెడ్డం, మాసిపోయిన చొక్కా, ముతక బారిన చిరుగుల పేంటు, తైల సంస్కారంలేని జుట్టు... ఏభై పైబడిన వయసు. ఇది అతని వాలకం.

అది రోజూ అతని దైనందిన చర్య. దానికి అంతం లేదు. ఎప్పుడు తింటాడో, ఎప్పుడు పడుకుంటాడో, ఎక్కడుంటాడో తెలీదు.

*　　*　　*

''చిన్నోడు అన్నం తిన్నాడా?'' జోసఫ్ అన్నాడు.

''లేదు అయినా నీకు తెలీకడుగుతావు, 'తిన్నాడా' అని దీర్ఘంతీసి మరీ అడుగుతున్నావ్. నీకు మాత్రం తెలీదా ఆడు తిన్నాడో లేదో, అసలు బియ్యం ఉన్నాయో లేవోనని.''

''సర్లె సర్లె, నిన్ను కదిపితే అంతే కందిరీగ తుట్ట. ఇప్పుడే వస్తానుండు'' లేచి బయటకెళ్లాడు జోసఫ్. అరగంట తర్వాత ఓ సంచినిండా బియ్యం తెచ్చాడు.

జోసఫ్, అతని భార్య, పెద్దకూతురు రాణి, పెద్ద కొడుకు రాజు, చిన్న కొడుకు చిట్టి—అదో చిన్న కుటుంబం. జోసఫ్ తన పిత్రార్జితం అయిన రెండెకరాల ఆసామి. అయితే ఆ పొలం మెరక మీద ఉండడంవల్ల సరిగా పంట చేతికి అందదు. పైగా తనుండేది గోదావరి, సముద్రం రెండూ ఉన్న గోదావరి జిల్లా ప్రదేశం. అక్కడ వాయుగుండాల మయం. అయితే ఆ ప్రాంతంలో ఓ విశేషం ఉంది. ఎలా వారధి ఏర్పడిందో తెలీదుగానీ, కువైట్, కటార్, అబుదాబీ లాంటి గల్ఫ్ దేశాలకు నేరుగా వెళ్ళిపోవడం నేర్చుకున్నారు. పెద్దగా చదవక పోయినా దాదాపు ప్రతి ఇంటికి ఇద్దరు గల్ఫ్‌లోనే ఉంటారు. అందుకే ఆ ప్రాంతంలో అందరి కళ్ళూ గల్ఫ్ మీదే ఉంటాయి.

''ఆ సంగతేమయ్యింది? బొంబాయి నుంచి కబురేమన్నా వచ్చిందా?'' భార్య అడిగింది.

''లేదే, దాని గురించే చూస్తున్నాను. ఈ యెదవ పొలం రాబడిమీద మనం బతకలేం. అప్పో సొప్పో చేసి 'క్వైట్టా' వెళ్ళి పోవడమే నయం. యెదవ బతుకు ఎంత బతికినా ఇలాగే ఉండేలాగుంది,'' జోసఫ్ అన్నాడు.

''మరే ఆ కాలవ అవతల సుధీర్ భార్య వెళ్ళిందంట శుభ్రంగా ఐదువేలు తెచ్చుకుంటుందంట. దర్జాగా ఉన్నాడు దాని మొగుడు. నువ్వుకూడా అదేదో త్వరగా చూసుకో'' భార్య అంది.

''సర్లే అన్నంపెట్టు రేపొద్దున్న అలా వెళ్తొస్తాను.''

*　　*　　*

ఇది జరిగిన వారానికి బొంబాయినుండి ఏజెంట్ లెటర్ వ్రాశాడు జోసఫ్‌ను వెంటనే రమ్మని. హుటాహుటిని బయల్దేరాడు జోసఫ్.

రావయ్యా, రా! నీపంట పండిందిలే, బహుశా వారం రోజుల్లో మనకు ఉత్తరం వస్తుంది. సరైన బేరం దొరికిందో నీ జన్మ ధన్యమైనట్టే'' ఏజెంట్ అన్నాడు.

''ఏమో, డబ్బంతా తెచ్చి నీ చేతుల్లో పోశాను. పొలం దాదాపు అమ్మకం అయిపోయినట్టే. పాలముంచినా, నీట ముంచినా నీదే భారం'' జోసఫ్ అన్నాడు. ఏజెంట్ భుజంతట్టాడు భరోసా యిస్తున్నట్టు.

''ఎవరూ జోసఫా! అరే నిజమే''! ఆశ్చర్యంగా నోరు తెరిచాడు సుధాకర్.

''సుధాకర్ నువ్వా? ఇక్కడున్నావేం?. అబుదాబి వెళ్ళలేదా?'' ఆ మాట వింటూనే సుధాకర్ ముఖం మ్లాన మైంది.

''లేదు జోసఫ్. గల్ఫ్ వెళ్ళడం ఉంది చూశావ్, అదో పెద్ద సుడిగుండం లాంటిది. గట్టెక్కావా సరేసరి లేదా, అంతే సంగతులు. ఆ ఊబికి అంతుండదు. పదివేలు తెచ్చి ఏజెంటు చేతిలో గుమ్మరించాను. ఇదిగో అదిగో అంటూ మరో పదివేలు తెమ్మన్నాడు. ఇచ్చాను. త్రిశంకు స్వర్గంలా ఉందనుకో'' సుధాకర్ చెప్పాడు.

అతని దగ్గర్నుంచి సెలవు తీసుకున్నా జోసఫ్ మనసు పరిపరి విధాల పోతోంది. 'తన గతేం అవుతుందో'?

మరి ఏ భగవంతుడు కరుణించాడో జోసఫ్ ఉద్యోగం ఖాయమైంది. దాదాపు నాలుగు వేల వరకు



ఇటీవల విజయనగరం దక్కిని వీధిలో శ్రీ అంబళ్ళ గురుమూర్తినాయుడు స్మారక ఉచిత గ్రంథాలయ పఠన మందిర ప్రారంభోత్సవ సందర్భంగా జరిగిన సభలో అధ్యక్షోపన్యాసం ఇస్తున్న డాక్టర్ వాగంటి తులసి. వేదికపైన కూర్చున్నది శ్రీ అంబళ్ళ సూర్యారావుగారు.

ఇండియన్ కరెన్సీలో వస్తోంది. అంతే జోసఫ్ కువైట్‌కి రివ్వున ఎగిరి పోయాడు.

* * *

నాలుగు సంవత్సరాలు గిర్రున తిరిగాయి......

"నాకు భయం బాబూ. నేను రాను" రాణీ అంది.

"సరే బాగుంది. నువ్వు నేను ప్రేమించుకున్నాం. త్వరలో పెళ్ళి చేసుకోబోతున్నాం. పోనీ ఏదో సరదాగా పిక్చర్‌కి వెళ్దామంటే భయమైతే ఎలా? పోనీ డబ్బు లైపోతా యనుకుంటే అప్పో, సొప్పో చేసి నేనే టికెట్స్ తీస్తాలే".

"ఛ...ఛ, అదికాదు రమేష్. డబ్బుకేం... మా డాడీ దయవల్ల దానికేం లోటులేదు. అయినా కాలేజి జరుగుతోంది. మరి ఆ టైములో నీతో..." నాన్చింది మాటలు.

"ఏదో సరదాగా, కాలక్షేపానికి..." రమేష్ తనకళ్ళల్లోకి సూటిగా చూస్తూ అనేసరికి, కాదనలేక పోయింది. సినిమా పూర్తయ్యాక రాణీ పర్సులో ఉన్న ఐదు వందల్లో మూడు వందలు రమేష్ చేతిలోకి వచ్చాయి. అవి వచ్చింది దొంగతనంగాకాదు, రాణీ స్వయంగా ఇచ్చినవే!

కాలేజీ అయిపోయే టైమ్‌కి సరిగ్గా బస్‌స్టాప్‌కి చేరుకుంది రాణీ.

* * *

"ఒరే ఇంకో పెగ్" అన్నాడు ప్రసాద్.

"వద్దురా ఇప్పటికే ఓవర్ అయిపోయింది" రాజు అన్నాడు. డిగ్రీ ఫైనలియర్ చదువుతున్నాడు.

"ఒరే ఎలాగైనా రాజు మన ఫ్రెండ్ అవడం అదృష్టంరా. ఓమంచి స్నేహితుణ్ణి పొందగలిగాం"

"ఎంజాయ్ ఫ్రెండ్స్ మన డాడీ బాసు ఉండగా మనకేంలోటులేదు. ఆయన పంపడం, మనం తాగడం, తినడం." రాజు అన్నాడు.

* * *

"ఒరే, సక్సెస్‌రా, గ్రాండ్ సక్సెస్! టిక్కెట్లు దొరికాయి. సరిగ్గా ఈరోజే పిక్చర్ మొదలు, మన టికెట్స్ ఫస్ట్" చిట్టి అరిచాడు. ఇంకా నలుగురైదుగు రున్నారక్కడ.

"శభాష్‌రా చిట్టీ, మన మీ రోజు పిక్చర్ మొదటి ఆట చూడకపోతే మూడ్ చెడిపోతుందిరా. ఎలా దొరికాయి టిక్కెట్లు!"

"ఎవడో ఎడ్వాన్సు టిక్కెట్లు తీసుకొని బ్లాక్‌లో అమ్ముతున్నాడు. బ్లాక్‌లో ఇవెంతో తెల్సా-ఆఫ్ట్రాల్ ఒక్కో టికెట్ మీదా ట్వెంటీఫైవ్ రూపీస్ ఎక్స్‌ట్రా. ఫినిష్."

"ఒరే చిట్టీ నువ్వూ, మీనాన్న, మనం కలకాలం ఇలాగే ఉండాలని కోరుకుంటున్నారా" అంటూ చిట్టితోపాటు అంతా సిగరెట్లు వెలిగించారు. సిగరెట్ ప్యాకెట్ అగ్గిపెట్టె చిట్టివి.

* * *

"అవునూ... నీమొగుడొస్తున్నా డన్నావ్, ఎప్పుడూ?" అన్నాడు రామరాజు. అతనడిగింది జోసఫ్ భార్యని!

"ఏం ఈ లోగా ఎంత కూడబెట్టు కున్నానవా?" వయ్యారాలు పోతూ అంది జోసఫ్ భార్య.

"చూడుమరి, బ్రహ్మాండమైన లైఫ్! నిన్ను నేను వదిలి ఉండలేక పోతున్నాను. నువ్వా, నన్నొదిలి అంతకంటే ఉండలేక పోతున్నావు. మరింకాలస్యం ఎందుకు, ఆ ముసిలాడు వచ్చేలోగానే పోదాం" రామరాజన్నాడు.



"నువ్వులేంది నేనొక్క క్షణంకూడ ఉండలేను. అంతా కలిపి చాలా మొత్తం ఉంది. వెళ్దామా మద్రాస్?" అంది.

* * *

"జోసఫ్, ఇండియాకెళ్తు న్నావటగా. ఈ మూణ్ణెల్ల సెలవు నీకు మూడు క్షణాలుగా ఉంటుందిలే, భార్య, పిల్లలతో బ్రహ్మాండమైన కాలక్షేపం. అన్నీ కొనుక్కెళ్ళు. ఇక్కడ అన్నీ చవగ్గా దొరుకుతాయి. నువ్వు మీ యింటికి పంపిన డబ్బు మాత్రం తీయద్దు. దాంతో ఏదైనా పొలం, ఇల్లు కొనుక్కో. మళ్ళీ తొందరగా




వచ్చేయ్." రహీం అన్నాడు. అతను జోసెఫ్ మిత్రుడు.

"నిజమే రహీం. ఏ స్థితిలో నుండి వచ్చానో, ఇక్కడికొచ్చి ఇంతటి వాణ్ణయ్యాను. ఇప్పుడు లక్షాధికారిని. నాకేలోటూ లేదు. వజ్రంలాంటి భార్య, రత్నాల్లాంటి బిడ్డలు! వాళ్ళ గురించే నేనిక్కడ కొచ్చింది. మనం పడ్డ శ్రమంతా వాళ్ళు ఆనందిస్తుంటే ఒక్క క్షణంలో మటుమాయం అవుతుంది." కళ్ళల్లో నీళ్ళు తిరుగుతుండగా అన్నాడు జోసఫ్.

"ఛ, ఛ, ఏడవకు, శుభమా అని ప్రయాణం పెట్టుకొని ఏడారంగ వెళ్తావ్? నో,నో సంతోషంగా వెళ్ళి రావాలోయ్" రహీం భుజంతట్టి ఆప్యాయంగా పంపించాడు.

* * *

జోసెఫ్ ఇండియాలో అడుగు పెట్టాడు. తన ప్రాంతంలో ప్రవేశించాడు. ఒక్కసారి మనసు, శరీరం పులకించాయి. అవే కొంచం సేపటిలో తనని తటిల్లతలా వణికిస్తాయని, తన మనసులో వాయుగుండా లేర్పడతాయని తెలీలేదు.

వడగళ్ళు కురిశాయి.

తుఫాను పెల్లుబికింది.

భయంకరమైన హోరుగాలి.

ఎక్కడో జోసఫ్ మెదడులోని నరం చిటుక్కుమంది!

* * *

"పాపం బాగానే ఉండేవాడు. అదిగో ఆ మహాతల్లీ, ఆ పిల్లలూ గొంతు కోశారు. పాపం అప్పట్నుంచీ అదిగో అలా పరిగెత్తుతూ అరుస్తుంటాడు"- జోసఫ్‌ను చూసిన వాళ్ళు అనుకొనే మాటలివి.

ఓ ఆర్నెల్ల తర్వాత ఆ రోడ్డు మీద ఆ అరపులు వినబడ లేదు.

రోజూ ఆ రోడ్డు తుడిచే మునిసిపాలిటీ స్వీపర్ మాత్రం జోసఫ్ శవాన్ని బండి మీదికి లాగినపుడు నిట్టూర్చాడు.


# కెశవర్ధిని...
## పొడవయిన, ఒత్తయిన శిరోజాలకి తరతరాల రహస్యం


పోషణ నిచ్చే కేశవర్ధిని తలనూనే

అందగత్తెలందరూ తమ ఆకర్షణీయమైన శిరోజాల సౌందర్య రహస్యం తరతరాలకి అందచేశారు.

కొద్దిచుక్కల కేశవర్ధినిని ఒక చెంచాడు కొబ్బరినూనెలో కలిపి శిరోజాలకి రోజూ రెండుసార్లు బాగా రాస్తే అవి ఎంతో అందంగా, ఒత్తుగా, పొడవుగా, నల్లగా, నిగనిగలాడుతూ ఆరోగ్యంగా పెరుగుతాయి.

ఈ రోజునే కేశవర్ధిని కొనండి.

ఆరునెలలలోనే అందమైన శిరోజాలు పొందండి.






OBM 8473 TG

**కేశవర్ధిని**
**తలనూనె**

కేశవర్ధిని ప్రోడక్ట్స్ (మద్రాసు)
మద్రాసు-600 092